క్లుప్తంగా

46.057 టీఎంసీలకు ఎస్సారెస్పీ నీటిమట్టం

జగిత్యాలఅగ్రికల్చర్: ఎస్సారెస్పీ నీటిమట్టం గురువారం వరకు 46.057 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టులోకి 13,910 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. 4,713 క్యూసెక్కుల అవుట్ ఫ్లోగా ఉంది.

చెరువు మరమ్మతుకు నిధులు మంజూరు

మేడిపల్లి: భీమారం మండలం పసునూరు ఊరచెరువు మరమ్మతుకు 15.30లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. చెరువు మరమ్మతుతో పసునూర్ ప్రాంతంలో భూగర్భజలాలు పెరుగుతాయని గ్రామస్తులంటున్నారు. నిధులు మంజూరు చేయించిన విప్‌కు మాజీ సర్పంచ్ మాలోతు లచ్చనాయక్, వీలేజి అధ్యక్షుడు పోతాని లింగమూర్తి, మార్కెట్ డైరెక్టర్ మాలోత్ హనుమంతు నాయక్ ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకానికి ఎంపిక

మేడిపల్లి: పదోతరగతి ఫలితాల్లో జిల్లావ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో రెండో స్థానంలో నిలిచిన భీమారం మండలం గోవిందారం ప్రభుత్వ పాఠశాలకు చెందిన పల్లికొండ పవన్(567) రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రూ.10వేల నగదు ప్రోత్సాహకానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు అశ్వక్ తెలిపారు. ఆగస్టు 15న జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రోత్సాహకాన్ని అందుకోనున్నట్లు తెలిపారు.
శ్రీమేధ ట్రస్ట్ హైదరాబాద్ నిర్వహించిన స్కాలర్‌షిప్ పరీక్షలో పవన్ ఉత్తీర్ణత సాధించగా.. 6 సంవత్సరాల కార్పొరేట్ విద్యను ఉచితంగా అందజేయనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు.
సారంగాపూర్: బీర్‌పూర్ మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు 2025 పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగే వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా మెమెంటో, రూ.10వేల నగదు ప్రోత్సాహకాన్ని అందుకోనున్నారు. బీర్‌పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కడార్ల అమూల్య 580, తుంగూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బూస హర్ష 575 మార్కులు సాధించారు.

ప్రభుత్వ భూములు చదును చేస్తే చర్యలు

కథలాపూర్: గంభీర్‌పూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూములను అక్రమంగా చదును చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వినోద్ హెచ్చరించారు. ఇటీవల గ్రామంలో ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ గురువారం గ్రామంలో పర్యటించారు. రికార్డులు పరిశీలించి సర్వే చేసేవరకు ప్రభుత్వ భూముల్లోకి ఎవరూ వెళ్లొద్దని, భూములు చదును చేయొద్దని గ్రామస్తులకు సూచించారు.

సంఘమిత్ర అధ్యక్షుడిగా సుధాకర్


నూతన కార్యవర్గ సభ్యులు

రాయికల్: పట్టణంలోని సంఘమిత్ర యూత్ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా జిల్లాల సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పటేల్ శివారెడ్డి, కోశాధికారిగా పాలడుగు విజయ్‌కేతన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జిల్లాల సూర్యంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గణపతి, దుర్గ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని అన్నారు. పటేల్ గోపాల్‌రెడ్డి, గంగారెడ్డి, పటేల్ గంగారెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా తుక్కారం

కోరుట్ల రూరల్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు గుగ్గిళ్ల తుక్కారంగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు నియామక పత్రం అందించారు.
మెట్‌పల్లి: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన వడ్డెపల్లి శ్రీనివాస్‌ను నియమించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గర్వంద శ్రీనివాస్‌గౌడ్(42) అనే వ్యక్తి పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. శ్రీనివాస్‌కు ఆరోగ్యం బాగా లేకపోవడంతోపాటు రూ.5లక్షల వరకు అప్పులుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 12న గ్రామ శివారులోని వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాటం

జగిత్యాల: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఇంజనీర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రమేశ్‌ను టీఎన్జీవోల ఆధ్వర్యంలో సన్మానించారు.

ప్రమాదాల చౌరస్తా..

- కానరాని స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు
- వాహనదారుల ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు


ఇబ్రహీంపట్నంలో ఇందిరాగాంధీ చౌరస్తా

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు డబుల్ రోడ్లు వేసినా.. ప్రధాన కూడళ్ల వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇబ్రహీంపట్నంకు రావడానికి జాతీయ రహదారి నుంచి ఉన్న సింగిల్ రోడ్డును 15 ఏళ్ల క్రితం డబుల్ రోడ్డుగా మార్చారు. దీంతో వాహనాలు అతివేగంగా వస్తూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద 4 గ్రామాలకు వెళ్లే రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చారు. ఈ చౌరస్తా నుంచి మెట్‌పల్లికి, ఇబ్రహీంపట్నం నుంచి నిర్మల్, ఖానాపూర్‌కు, నిర్మల్ జిల్లాకు నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. మహారాష్ట్ర నుంచి నిర్మల్ జిల్లా మీదుగా ఇబ్రహీంపట్నం నుంచి ఇతర జిల్లాలకు తక్కువ దూరమవుతున్నందున చాలామంది వాహనాదారులు ఈ రోడ్డుపై ప్రయాణిస్తూ ఉంటారు. అయితే మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేక వాహనాలు అతివేగంగా వస్తున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నాలుగు దారుల చౌరస్తా వద్ద వాహనాలు వేగంగా వెళ్లడంతో ప్రమాదాలు జరిగి గాయాలపాలవుతున్నారు.

కానరాని హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు

ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద 4 గ్రామాలకు వెళ్లే రోడ్లు ఉండడంతో నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ఇక్కడ ఆర్అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల చౌరస్తాగా మారింది. హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భారీ ప్రమాదాలు జరగకముందే హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద అతివేగంగా వాహనాలు వస్తున్నాయి. తరచూ చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్ద ప్రమాదాలు జరగకముందే ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకొని హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు నియంత్రించాలి.

– ఏలేటి చిన్నారెడ్డి, ఇబ్రహీంపట్నం

అధికారులు చర్యలు చేపట్టాలి



చౌరస్తా వద్దనే నా షాపు ఉంది. నిత్యం ఈ చౌరస్తా వద్ద వాహనాలు అతివేగంగా వెళ్తుంటాయి. అప్పుడప్పుడు చౌరస్తా వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– తిమ్మణి అరుణ్, ఇబ్రహీంపట్నం

ప్రతిపాదనలు పంపించాం

ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద 4 రోడ్లకిరువైపులా వాహనాల వేగం తగ్గించేందుకు రోడ్డు స్టడ్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే ఏర్పాటు చేస్తాం.

– ఫాయిజుస్, ఆర్అండ్‌బీ ఏఈ, మెట్‌పల్లి


జగిత్యాల: చిన్నారుల వేషధారణ


కథలాపూర్: పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

కృష్ణాష్టమి వేడుకలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో గురువారం కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో అలరించారు. డైరెక్టర్ శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మానికరావు పాల్గొన్నారు.
కోరుట్ల: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం కృష్ణమోహన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
రాయికల్: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషాధారణలో ఉట్టి కొట్టారు. కరస్పాండెంట్ ఎద్దండి ముత్యం రాజిరెడ్డి, డైరెక్టర్ నివేదితరెడ్డి పాల్గొన్నారు.
వెల్గటూర్: మండల కేంద్రంలోని విజ్ఞాన్ కిడ్స్ స్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ దోరిశెట్టి మల్లేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
కథలాపూర్: బొమ్మెన, కథలాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలో సందడి చేశారు. ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. బహుమతులందించారు. హెచ్ఎంలు అంబటి రవి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కోరుట్ల: బాలికల ఉన్నత పాఠశాలలో..


వెల్గటూర్: ఉట్టి కొడుతున్న చిన్నారులు


రాయికల్: శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో విద్యార్థులు



పెగడపల్లి: అయితిపల్లిలో నిర్మించిన భారత్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్(పల్లె దవాఖాన) భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. స్థానికంగా పక్కా భవనం లేక ఏళ్ల తరబడి అద్దె ఇంటిలో కాలం వెళ్లదీశారు. దీంతో వైద్య సిబ్బంది, వైద్యం కోసం వచ్చే ప్రజలు వసతుల్లేక ఇబ్బందులు పడ్డారు. పల్లె దవాఖానకు పక్కా భవనం నిర్మాణం కోసం రూ.20లక్షలు ప్రభుత్వం మంజూరు చేయగా.. ఇటీవల నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధం చేశారు. త్వరలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా భవనం ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వైద్యాధికారి నరేశ్, పీఆర్ ఏఈ శంషేర్‌అలీ తెలిపారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరిస్తా


గోధూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఇబ్రహీంపట్నం: ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరిస్తామని, ఉపాధిహామీ పనుల్లో ఏమైనా సమస్యలుంటే తెలపాలని ఎంపీడీవో ఎండీ సలీమ్ అన్నారు. గురువారం గోధూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్‌తండాలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధిహామీ పనులను పరిశీలించారు. గోధూర్‌లో కూలి డబ్బులు ఆలస్యంగా వస్తున్నాయని కూలీలు తెలపగా.. ఆలస్యం కాకుండా చూస్తానన్నారు. కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు విన్నవిస్తున్న హరిజనులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్ర శివారులోని కలకుంట్ల దగ్గర సుమారు 60 గుంటల భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం హరిజన కులస్తులు తహసీల్దార్ వరప్రసాద్‌కు విన్నవించారు. సర్వే నంబర్ 472లో కనక శైలజ, కనక మల్లు, కొత్తూరి పెద్దు, కనక గంగు, కనక లావణ్య, నల్లూరి పెద్ద గంగు, కనక రాజు, సంగర్తుల మలక్కవ్వ, కనక గంగరాజు, గడసంద జ్యోతికి చెందిన సుమారు 60 గుంటల భూమిని గ్రామానికి చెందిన బద్దం శ్రీనివాస్‌రెడ్డి కబ్జా చేసి భూమిలో పైపులైన్లు వేసి హద్దులు పాతారన్నారు.

ప్రతీ మహిళను చేర్చుకోవాలి


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎం తదితరులు

మల్యాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఇందిరా మహిళా శక్తి పథకం కింద గ్రామ సంఘాల పాలకవర్గ సభ్యులు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల్లో లేని మహిళలను గుర్తించి సభ్యులుగా చేర్చాలని, నూతన మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలని ఏపీఎం దేవరాజ్ అన్నారు. ఆమని, అన్విత, కృష్ణమోహన్, చిన్న మల్లయ్య, గంగారాజం, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, సరిత, మహిళలు పాల్గొన్నారు.
జగిత్యాలరూరల్: జిల్లాలో దివ్యాంగుల సంఘాల ఏర్పాటుకు వీవోఏలు ఇంటింటి సర్వే పూర్తి చేయాలని జిల్లా ఐబీబీఎల్ ఏపీఎం గంగాధర్ అన్నారు. గురువారం జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో వీవోఏలు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులకు మహిళా సంఘాలకు మహిళా శక్తి నూతన సంఘాల ఏర్పాటుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏపీఎం రాజయ్య, స్త్రీనిధి ఆర్ఎం రాంనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మేడిపల్లి: పీఆర్‌టీయూ టీఎస్ భీమారం మండల శాఖ ఆధ్వర్యంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మండల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. సెప్టెంబర్ 1న ఇందిరా పార్కు వద్ద ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు ఉపాధ్యాయ ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. గంగాధర్, ప్రవీణ్ పాల్గొన్నారు.
రాయికల్: సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన మహా ధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేశ్ కోరారు. గురువారం రాయికల్ బాలికల ఉన్నత పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. రాజేశం, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
వెల్గటూర్: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మహా ధర్నా పోస్టర్‌ను ఎండపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆవిష్కరించినట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మ రవి, జోగం శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను గ్రామాల్లోకి రానివ్వొద్దు

సారంగాపూర్: గంజాయి, మత్తు పదార్థాలు గ్రామాల్లోకి రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గీత కోరారు. గురువారం రేచపల్లి గ్రామంలో యువకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలను వివరించారు.

అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు

మెట్‌పల్లి: వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న గోదాముల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని చైర్మన్ కూన గోవర్ధన్ తెలిపారు. మార్కెట్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 10న జరిగిన అగ్ని ప్రమాదంపై పోలీసులు విచారణ జరుపుతున్నారన్నారు. మార్కెట్లో పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇందుకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని అన్నారు.

భీష్మ విగ్రహావిష్కరణ

రాయికల్: చెర్లకొండాపూర్ గ్రామంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భీష్మ పితామహుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత హాజరయ్యారు. నాయకులు దుబ్బాక నర్సయ్య, లింగయ్య, సురేశ్, దుబ్బాక సురేశ్, పల్లికొండ రమేశ్, నాగరాజు, శివకుమార్, లక్ష్మీనారాయణ, చిన్నరాజం పాల్గొన్నారు.

సాయిబాబా దేవాలయంలో పూజలు

జగిత్యాలరూరల్: పొలాస గ్రామ శివారులోని సాయిబాబా దేవాలయంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయిబాబాకు క్షీరాభిషేకం చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు గుండేటి గంగారాజం పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్ల కల.. నెరవేరిన వేళ..

వెల్గటూర్: శాఖాపూర్, ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామాల మధ్య రాకపోకలకు సరైన రోడ్డు మార్గం లేక ఏళ్లుగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు.. వాగు దాటి వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ విషయమై మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి సమస్యను మంత్రి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే స్పందించి శాఖాపూర్-కొండాపూర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డును మంజూరు చేయించారు. రోడ్డు నిర్మాణం చేపట్టడంతో ఎన్నో ఏళ్ల కల మంత్రి చొరవతో నెరవేరిందని రెండు గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపండి


జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

జగిత్యాలటౌన్: ఇళ్ల మధ్య సెల్ టవర్ నిర్మాణం నిలిపివేసేందుకు సహకరించాలని కాలనీవాసులు మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ట్రాయ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ జగిత్యాల మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో నిర్మించతలపెట్టిన సెల్ టవర్‌తో రేడియేషన్ సమస్యలు తలెత్తే ప్రమాదం పొంచి ఉందంటూ కాలనీవాసులు గురువారం జీవన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అధికారులతో మాట్లాడి పనులు నిలిపేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రోడ్డు బాగు చేయాలి


ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న కాలనీవాసులు

జగిత్యాల: రోడ్డును అభివృద్ధిపరిచేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు 42వ వార్డు ప్రజలు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 42వ వార్డులో మసీదు రోడ్డు పూర్తిగా చెడిపోవడంతో వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే నూతన రోడ్డు వేయాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మైనార్టీ నాయకులు ముజాహిద్, హనీస్, అసిఫ్, మహ్మద్ ఖాసీం అలీ పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేయాలి

జగిత్యాల: వేతనాల్లేక ఇబ్బందులకు గురవుతున్నామని అదనపు కలెక్టర్ బీఎస్ లతకు ఆర్పీలు వినతిపత్రం అందజేశారు. ఈ సంవత్సరం మార్చి నుంచి వేతనాలు రావడం లేదని, దీంతో కుటుంబాలు గడవడం కష్టతరంగా ఉందన్నారు. జిల్లా మెప్మా ఆర్పీల సంఘం అధ్యక్షురాలు రమ పాల్గొన్నారు.
రాయికల్: పట్టణంలోని మెప్మా ఆర్పీలకు 6 నెలల జీతాలు చెల్లించాలని, పీఆర్సీ అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనిత, వెగ్యారపు రమ్య, తీగుళ్ల జయసుధ, అనూష పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

రాయికల్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని 10వ వార్డులో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు.

భారత్ సంకల్ప దివస్

రాయికల్: పట్టణంలోని భరతమాత విగ్రహం వద్ద గురువారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అఖండ భారత్ సంకల్ప దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాయితి గంగాధర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్మరణలో..

మల్యాల: అమరవీరులను స్మరించుకుంటూ గురువారం ముత్యంపేటలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేశారు. సంగని రవి, మైపాల్‌రెడ్డి, పన్నాటి మల్లేశం, కోన శ్రీనివాస్, సంత శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు కేవలం మార్కులపైనే కాకుండా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఆర్‌కే విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ అన్నారు. గురువారం ఆర్‌కే విద్యాసంస్థల వార్షిక వేడుకలు నిర్వహించారు.

బూట్లు, సాక్సులు అందజేత



ధర్మపురి: దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు బూట్లు, సాక్సులను బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆసం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివేకానంద యువజన సంఘం విద్యార్థులకు అందజేసింది. ముఖ్య అతిథిగా మండల విద్యాధికారిణి సీతామహాలక్ష్మి హాజరై యువజన సంఘం సభ్యులను అభినందించారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

రాయికల్: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు సహకరించాలని డీఈవో రాము అన్నారు. గురువారం అల్లీపూర్ గ్రామంలో 2024–25 పదోతరగతి విద్యార్థులంతా కలిసి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయగా.. బాస్కెట్‌బాల్ కోర్టును డీఈవో ప్రారంభించారు.

వైద్యశిబిరానికి స్పందన

కథలాపూర్: కథలాపూర్‌లో కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఆర్థో, జనరల్ ఫిజిషియన్ ప్రత్యేక వైద్యులు సుమారు 300 మందికి చికిత్సలు అందించారు. ఆసుపత్రి నిర్వాహకుడు గుర్రం కిరణ్, వైద్యులు నాగరాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు సన్మానం

జగిత్యాలరూరల్: జిల్లాలో ఇటీవల డిప్యూటీ తహసీల్దార్ నుంచి తహసీల్దార్‌గా పదోన్నతి పొందిన కొడిమ్యాల తహసీల్దార్ మండలోజు కిరణ్‌కుమార్, బుగ్గారం తహసీల్దార్ లకావత్ తిరుపతినాయక్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ అరుణ్‌కుమార్‌ను జగిత్యాల రూరల్ తహసీల్ కార్యాలయంలో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. రాష్ట్ర బాధ్యుడు గాంధ్ర రాజేందర్‌రావు, జిల్లా సంఘం అధ్యక్షుడు గాలిపల్లి అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చిట్యాల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.